సాక్షి
రంగారెడ్డి

బుధవారం । 1 । అక్టోబర్ । 2025



హిందువులకు రక్షణగా..

ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను మామిడిపల్లి గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.

10లో▸



పీపుల్ వెల్ఫేర్ పోలీసింగ్

నగర పోలీసు కమిషనరేట్‌లో పీపుల్ వెల్ఫేర్ పోలీసింగ్ ఆవిష్కృతం కానుందని కొత్త కొత్వాల్ వీసీ సజ్జనర్ తెలిపారు.

10లో▸



స్థానిక పోరుకు సిద్ధం కండి

పార్టీ అభ్యర్థుల గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి పిలుపునిచ్చారు.

10లో▸

న్యూస్‌రీల్

ఎన్నికలకు సిద్ధం కండి

కేంద్ర మంత్రి బండి సంజయ్



బండి సంజయ్‌ను కలిసిన గణేశ్ కండె తదితరులు

చేవెళ్ల: స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీశ్రేణులు సిద్ధంగా ఉండాలని కేంద్రమంత్రి బండి సంజయ్ సూచించారు. మంగళవారం మంగళవారం కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయంలో పూజలకు హాజరైన బండి సంజయ్‌ను ఇటీవల బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన గణేశ్ కండెతో పార్టీ పార్టీ కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్రం మంత్రి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో అధిక సీట్లను గెలుచుకునేలా పనిచేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడే వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. ఆయన్ను కలిసిన వారిలో చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు ఎ.అనంత్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు పాండురంగారెడ్డి, యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'ఐక్యత' సేవలు వినియోగించుకోవాలి

టాస్క్ సీఈఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



ఆలయాభివృద్ధికి చెక్కు అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: ఐక్యత స్వచ్ఛంద సంస్థ సేవలను కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టాస్క్ సీఈఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం ఆయన మేడిగడ్డ తండా ముత్యాలమ్మ ఆలయాభివృద్ధికి రూ.లక్ష చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలే లక్ష్యంగా ఫౌండేషన్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యరక్రమంలో మాజీ సర్పంచ్ అంబర్‌సింగ్, మాజీ ఉపసర్పంచ్ మల్లేశ్ నాయక్, ఆలయ పూజారి వినోద్‌కుమార్, నాయకులు రాంజ్యానాయక్, మల్లేశ్, తావు, మల్యా, మణిపాల్, కిషన్‌నాయక్, శ్రీనునాయక్, కుబ్యా, రాజు, దేవ్యా, సీతారాం, రాజు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

జిల్లా వ్యవసాయాధికారి ఉష



మన గ్రోమోర్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఏఓ ఉష

కొందుర్గు: రైతులు సాగుచేసిన పంటలను రైతు విస్తరణాధికారి వద్ద నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉష సూచించారు. మంగళవారం ఆమె కొందుర్గు, రామచంద్రాపూర్ గ్రామాలను సందర్శించి రైతు ఆగ్రో కేంద్రం, మన గ్రోమోర్ సెంటర్, పీఏసీఎస్‌లలో రికార్డులను పరిశీలించారు. యూరియా స్టాకు, రైతులకు అందజేసిన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం డీఏఓ ఉష మాట్లాడుతూ.. రైతుల అవసరం మేరకు యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులకు నాణ్యమైన పురుగుమందు విక్రయించాలని.. కొనుగోలు సమయంలో విధుగా రసీదు ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రైతులకు రాయితీపై ట్రాక్టర్ పనిముట్లు, స్ప్రేయర్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జతచేసి సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారికి దరఖాస్తు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సురేశ్ రెడ్డి, ఏఈఓ వాసవి పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓగా లలితాదేవి



సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ లలితాదేవిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేసిన డాక్టర్ వెంకటేశ్వర్‌రావు రిటైర్డ్ అవ్వడంతో ఆయన స్థానంలో డాక్టర్ లలితాదేవికి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో వైద్య ఆరోగ్య సేవలను బలోపేతం చేస్తామన్నారు.

స్థానికం.. సందిగ్ధం

ఖర్చు చేశాక.. రాత మారితే!

- రిజర్వేషన్ల వ్యవహారం కోర్టులో ఉండటంతో అనిశ్చితి
- 9వ తేదీ తర్వాతే స్పీడ్ పెంచే యోచనలో రేసుగుర్రాలు
- అప్పటి వరకు వేచి చూస్తేనే మంచిదనే ధోరణిలో ఆశావహులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: అసలే దసరా పండుగ.. ఆపై స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్.. దీనికి తోడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై అయోమయం.. వెరసి ఆశావహుల గుండెల్లో దడపుట్టిస్తోంది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. అయితే ఇదే అంశంపై హైకోర్టులో కేసు కొనసాగుతోంది. నవంబర్ 8న ఈ కేసు విచారణకు రానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆయా స్థానాలకు ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్లు.. ఆశావహుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. తీరా ఖర్చు చేసిన తర్వాత రిజర్వేషన్లు మారితే.. తమ భవిష్యత్ ఏమిటనే ప్రశ్న ప్రతీ ఒక్కరిని తొలిచేస్తోంది. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకునే కన్నా. .రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు తీర్పు తర్వాతే ముందుకు వెళ్లాలని మెజార్టీ ఆశావహులు భావిస్తున్నట్లు తెలిసింది. దావత్‌లు, ఇతర ఖర్చుల విషయంలో అప్పటి వరకు వేచి చూడడమే ఉత్తమమనే అభిప్రాయంతో ఉన్నట్లు సమాచారం.

దడపుట్టిస్తున్న దసరా

ఎన్నికల కమిషన్ ఎంత చెప్పినా.. నిబంధనలను కఠినంగా అమలు చేసినా.. ఫ్లెక్సీలు, పత్రిక ప్రకటనల రూపంలో హెచ్చరికలు జారీ చేసినా.. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ఓటుకు నోటు కామనే. పోటీలో ఉండాలని భావించే ఆశావహుల నుంచి ఓటర్లు ఎంతో కొంత ఆశిస్తూనే ఉంటారు. నామినేషన్ మొదలు.. ఇంటింటి ప్రచారంలో భాగంగా కరపత్రాలు, వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలకు ఎంతో కొంత ఖర్చు చేయాల్సిందే. ప్రచారంలో భాగంగా రోజూ వెంట వచ్చే కార్యకర్తలు, ముఖ్య నాయకులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి మద్యం సరఫరా చేయాల్సిందే. జెడ్పీటీసీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థి కనీసం రూ.కోటి, ఎంపీపీ పదవిని ఆశించే అభ్యర్థి కనీసం రూ.50 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. తెలంగాణలో అతిపెద్ద పండుగ దసరా. ఈ నేపథ్యంలో మామూళ్లు ఇచ్చిపుచ్చుకోవడం సహజం. అయితే గ్రామీణ ప్రాంతాల్లోని కొంత మంది ఆశావహుల నుంచి మద్యం ఆశిస్తుంటారు. అసలే ఎన్నికల సమయం.. అడిగిన వాళ్లను కాదంటే తమకు ఓటు వేయబోరనే భయం అభ్యర్థులను వెంటాడుతుంటోంది. తమ వద్ద లేకపోయినా..అప్పు చేసైనా ఆయా ఓటర్ల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఈ ఖర్చులను భరించే శక్తిలేని వాళ్లు.. ఏదో ఓ సాకుతో ఊరు నుంచి ఇతర ప్రాంతాలకు కన్పించకుండా వెళ్లిపోతున్నారు. మరికొంతమంది ఏకంగా ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకున్నారు.

తీర్పు భిన్నంగా వస్తే..

జిల్లాలో 21 జెడ్పీటీసీ స్థానాలుండగా, 230 ఎంపీటీసీ స్థానాలు, 526 గ్రామ పంచాయతీలు, 4,668 వార్డులు ఉన్నాయి. పార్టీ గుర్తుపై నిర్వహించే ఒక్కో జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానానికి అధికార కాంగ్రెస్ నుంచి ఒకరు, ప్రతిపక్ష బీజేపీ, బీఆర్‌ఎస్, సీపీఎం, సీపీఐ, బీఎస్పీ ఒక్కొక్కరు చొప్పున బరిలో నిలిచే అవకాశం ఉంది. వీరితో పాటు మరో నలుగురు స్వతంత్రులు పోటీ చేయనున్నారు. ఇలా ఒక్కోస్థానం నుంచి కనీసం పది మంది వదరకు పోటీలో ఉండనున్నారు. జిల్లా వ్యాప్తంగా జెడ్పీటీసీ స్థానాలకు 200–210 మంది వరకు, ఎంపీటీసీ స్థానాలకు 2,300 మంది వరకు పోటీ చేయనున్నారు. ఇక పార్టీ గుర్తులకు అతీతంగా నిర్వహించే ఒక్కో సర్పంచ్ స్థానానికి కనీసం ముగ్గురు నుంచి నలుగురు అభ్యర్థుల చొప్పున రెండు వేల మంది వరకు పోటీలో ఉండనున్నారు. ఒక్కో వార్డుకు ఇద్దరు ముగ్గురు చొప్పున పది వేల మంది అభ్యర్థులు పోటీలో ఉండనున్నారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించ కూడదనే రాజ్యాంగ సూత్రానికి విరుద్ధంగా జీఓ జారీ చేయడం, కొంత మంది ఇప్పటికే ఆ అంశంపై కోర్టుకు వెళ్లడం, నవంబర్ 8న విచారణ చేపట్టనున్నట్లు హైకోర్టు వెల్లడించడం తెలిసిందే. ప్రకటించిన రిజర్వేషన్లకు భిన్నంగా తీర్పు వస్తే తమ పరిస్థితి ఏమిటనే ప్రశ్న సర్వత్రా వ్యక్తమవుతోంది.

జిల్లా వివరాలు

జెడ్పీటీసీ స్థానాలు	21
ఎంపీటీసీ స్థానాలు	230
గ్రామ పంచాయతీలు	526
వార్డులు	4,668

పారదర్శకంగా...

ప్రశాంతంగా ఎన్నికలు!

- సమర్థవంతంగా నిర్వహించేందుకు సన్నద్ధం
- అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఇప్పటికే ఓటర్ల జాబితా, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాల గుర్తింపు, రిజర్వేషన్ల కేటాయింపు, ఎన్నికల షెడ్యూల్ విడుదల ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని వర్గాలు సహకరించాలని కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. షెడ్యూల్ విడుదలతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, ఎన్నిల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నామినేషన్ల స్వీకరణకు కేటాయించిన తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అవకాశం ఉంటుందన్నారు.

హోర్డింగ్‌లు తొలగించాల్సిందే

జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశామన్నారు. ఎన్నికల సిబ్బంది ఎంపిక, శిక్షణ, ఓటింగ్ నిర్వహణ, లెక్కింపు వంటి అంశాలపై వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లోని రాజకీయ నేతల ఫొటోలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, బ్యానర్లను తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో 24 గంటల వ్యవధిలో, బస్టాండ్, రైల్వే స్టేషన్ పెట్రోల్ బంక్ తదితర పబ్లిక్ ప్రదేశాల్లో 48 గంటల వ్యవధిలో, అనుమతి లేని ప్రైవేట్ స్థలాల్లో 72 గంటల వ్యవధిలో తొలగించాలన్నారు. అంతకు ముందు రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేశ్‌మోహన్, కాంగ్రెస్ పార్టీ నుంచి ఆవుల యాదయ్య, నవీన్ కుమార్, జంగారెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి సత్తు వెంకటరమణ రెడ్డి, మిట్టు జగదీశ్వర్, బీజేపీ నుంచి అందెల శ్రీరాములు, దేవేందర్‌రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల వివరాలు

ఫేజ్–1	
నోటిఫికేషన్	అక్టోబర్ 9
నామినేషన్ల స్వీకరణ	అక్టోబర్ 9– 11 వరకు
పోలింగ్	అక్టోబర్ 23
లెక్కింపు	నవంబర్ 11
ఫేజ్–2	
నోటిఫికేషన్	అక్టోబర్ 13
నామినేషన్ల స్వీకరణ	అక్టోబర్ 13– 15 వరకు
పోలింగ్	అక్టోబర్ 27
లెక్కింపు	నవంబర్ 11

సర్పంచ్‌లకు ఇలా

ఫేజ్–1	
నోటిఫికేషన్	అక్టోబర్ 17
నామినేషన్ల స్వీకరణ	అక్టోబర్ 17 – 19వరకు
పోలింగ్	అక్టోబర్ 31
ఫేజ్–2	
నోటిఫికేషన్	అక్టోబర్ 21
నామినేషన్ల స్వీకరణ	అక్టోబర్ 21–23 వరకు
పోలింగ్	నవంబర్ 4



మాట్లాడుతున్న సత్తయ్య

రైతు సంక్షేమమే ధ్యేయం

టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ సత్తయ్య

తుర్కయంజాల్: రైతుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. రాగన్నగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం 53వ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరంలో సంఘం రూ.4.5కోట్ల నికర లాభం సాధించిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. రైతులు పంట రుణాలను సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి సహకరించాలని కోరారు. గత ప్రభుత్వం హయాంలో కొహెడలో ఐదెకరాల్లో గోదాములు నిర్మించి నెలకు రూ.7.5లక్షల అద్దెవస్తుందని వివరించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరావు నాబార్డు 40వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఉత్తమ సంఘం అవార్డును సాధించామని గుర్తుచేశారు. స్టడీ టూర్ నిమిత్తం కేరళ, హిమాచల్ ప్రదేశ్, ఒరిస్సా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోని అనేక సహకార సంఘాల ప్రతినిధులు, ఉద్యోగుల బృందం పరిశీలనకు వచ్చిందని గుర్తుచేశారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో ఆదిబట్లలో ఖరీదైన ప్రాంతంలో ప్రభుత్వం డీసీసీబీ కార్యాలయ నిర్మాణానికి ఎకరం భూమిని కేటాయించిందన్నారు. త్వరలోనే ఈ స్థలంలో భవన నిర్మాణ పనులను చేపడతామన్నారు. అనంతరం సంఘం సెక్రటరీ వై.రాందాస్ 2025–26 ఆర్థిక సంవత్సరంలో 2025 ఆగస్టు 31 వరకు జరిగిన లావాదేవీలు, జమ, ఖర్చులను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో పీఏసీ సభ్యులు వంగేటి లక్ష్మారెడ్డి, సామ సంజీవరెడ్డి, కొంద్రు స్వప్న శ్రీనివాస్, చాపల యాదగిరి, కొత్త రాంరెడ్డి, కృష్ణారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, మాజీ చైర్మన్లు సంరెడ్డి బాల్‌రెడ్డి, కొంతం మల్లారెడ్డి, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిధుల స్వాహాపై చర్యలు నిల్

- రూ.కోటిన్నరకు పైగా గోల్‌మాల్ చేసిన వీబీకే, బ్యాంకు సిబ్బంది
- నిత్యం ఐకేపీ, యాచారం ఎస్‌బీఐ చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న చౌదర్‌పల్లి డ్వాక్రా సంఘాల మహిళలు
- అభద్రతాభావంలో సభ్యులు
- సభ్యత్వం రద్దు చేసుకునే యోచనలో మహిళలు



యాచారం ఐకేపీ కార్యాలయం

యాచారం: స్వయం సహాయక సంఘాలపై మహిళలు విశ్వాసం కోల్పోతున్నారు. తాము పొదుపు చేసే డబ్బులు, బ్యాంకుల నుంచి అందే రుణాల విషయంలో రక్షణ లేక.. భారీ అవకతవకలు జరిగినా పట్టించుకునే వారే లేకపోవడంతో మహిళలు సంఘాల నుంచి విత్‌డ్రా అయ్యే యోచనలో ఉన్నారు. నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకునే విషయంలో డీఆర్‌డీఓ అధికారులు, బ్యాంకు ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో మహిళల్లో అభద్రతాభావం నెలకొంది. మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలో ఓ వీబీకే(విలేజ్ బుక్ కీపర్), బ్యాంకు సిబ్బంది కలిసి దాదాపు 20 స్వయం సహాయక సంఘాలకు దక్కాల్సిన రూ.కోటిన్నరకు పైగా నిధులు దుర్వినియోగం చేసి సంచలనంగా మారిన విషయం విదితమే. గ్రామానికి చెందిన మహిళలు స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లడం, స్పందించిన ఎమ్మెల్యే వెంటనే డీఆర్‌డీఓ, బ్యాంకు ఉన్నతాధికారులకు ఫోన్ చేసి నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించినా ఫలితం లేకుండా పోయింది. తొలుత హంగామా చేసి ఆ తర్వాత మిన్నకుండిపోయారు.

పక్షం రోజుల విచారణ చేసి..

చౌదర్‌పల్లి గ్రామంలోని 20కి పైగా స్వయం సహాయక సంఘాల్లో జరిగిన నిధుల స్వాహాపై డీఆర్‌డీఓ శ్రీలత ఆదేశాల మేరకు డీపీఎం యాదయ్య, లీలాకుమారి 15 రోజుల పాటు విచారణ చేశారు. గ్రామానికి చెందిన రికార్డులను ఆడిట్ సిబ్బంది శ్రీనివాస్, మధు క్షుణ్ణంగా పరిశీలించి.. ప్రతీ స్వయం సహాయక సంఘం పేరు మీద యాచారం ఎస్‌బీఐలో రూ.లక్షలాది రుణాలు పొందినట్లు, ఆ డబ్బును సంఘంలో సభ్యులుగా లేని మహిళల బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించినట్లు గుర్తించారు. ఒక్కో సంఘంలో రూ.10 నుంచి రూ.15 లక్షలు బినామీ పేర్లపై బదిలీ అయినట్లు గుర్తించారు. గ్రామానికి చెందిన మహిళలు స్వయంగా మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయానికి వచ్చి విచారణ అధికారులకు ఫిర్యాదులు చేశారు. విచారణ పూర్తి చేసి పక్షం రోజులు గడిచిపోయినా బాధ్యులపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో బోధపడడం లేదు.

మాఫీ.. లేదా రికవరీ చేయండి

నిధుల దుర్వినియోగంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలంటూ సంఘాల సభ్యులు అధికారులను ప్రాధేయపడుతున్నారు. ఐకేపీ కార్యాలయం సిబ్బంది, ఎస్‌బీఐ అధికారులను కలిసినా ఎటువంటి సమాధానం లభించడం లేదు. రుణాలు పూర్తిగా మాఫీ చేయాలని లేదంటే.. స్వాహా చేసిన అధికారుల నుంచి రికవరీ చేయాలని వేడుకుంటున్నారు. విచారణకు వచ్చిన డీఆర్‌డీఏ అధికారులు ఐకేపీ కార్యాలయానికే పరిమితమయ్యారు. ఏ ఒక్క రోజు సంఘం సభ్యులను కలిసి దాఖలాలు లేవంటూ ఆరోపిస్తున్నారు. నిధుల దుర్వినియోగం సమయంలో యాచారం ఎస్‌బీఐ మేనేజర్, తాజాగా చౌదర్‌పల్లి ఐకేపీ సీసీ జంగయ్య సైతం బదిలీ అవ్వడంతో మహిళల్లో ఆందోళన వ్యక్తమవుతుంది.

డీఆర్‌డీఓ నిర్ణయమే పెండింగ్



చౌదర్‌పల్లి స్వయం సహాయక సంఘాల్లో జరిగిన నిధుల అవకతవకలపై విచారణ చేపట్టాం. డీపీఎంలు యాదయ్య, లీలాకుమారిలు 15 రోజులు విచారించారు. డీఆర్‌డీఓ నిర్ణయమే పెండింగ్‌లో ఉంది. త్వరలో ఐకేపీ ఆధ్వర్యంలో చౌదర్‌పల్లికి వెళ్లి మహిళా సంఘాలతో సమావేశమై క్షేత్రస్థాయిలో విచారణ జరుపుతాం.

– రవీందర్, ఐకేపీ ఏపీఎం యాచారం

నెల రోజులుగా ఏం చేస్తున్నట్లు..?

అధికారుల తీరుపై మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆగ్రహం



అధికారులతో మాట్లాతున్న ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కాలె యాదయ్య

మొయినాబాద్: రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడినా పట్టించుకోరా అంటూ మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ పరిధిలోని చిలుకూరులో నెల రోజులకుపైగా పెద్ద చెరువు అలుగు పారుతూ రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. మంగళవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, మున్సిపల్ అధికారులతో కలిసి చిలుకూరు వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలను పరిశీలించారు. అదే సమయంలో మండల పరిధిలోని రెడ్డిపల్లిలో తన ఫాంహౌస్‌కు వెళ్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చిలుకూరులో ఆగారు. చెరువు అలుగు పారుతూ రోడ్డుపై గుంతల పడితే ఇలానే వదిలేస్తారా.? నెల రోజులుగా ఇలాగే ఉంది. వాహనాలు రాకపోకలకు తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలి కదా.. అసలు అధికారులు పనిచేస్తున్నారా.. లేదా..? నెల రోజులుగా రాకపోకలకు తీవ్ర ఇబ్బంది అవుతున్నా ఏం చేస్తున్నారంటూ అధికారులపై మండిపడ్డారు. అలుగు నీరు వెళ్లేందుకు వీలుగా పైపులు వేసి తాత్కాలిక మరమ్మత్తులైనా చేపట్టాలి కదా అంటూ ఆర్ అండ్ బీ, మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి నుంచే ఆర్ అండ్ బీ ఎస్ఈ, ఇరిగేషన్ ఎస్ఈలకు ఫోన్ చేసి మాట్లాడారు. వెంటనే పైపులు వేసి వాహనాలు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం వల్లే సమస్య ఎక్కువైందని స్థానికులు కోమటిరెడ్డికి వివరించారు. కుంటలు కబ్జా కావడంతో పాటు డ్రైనేజీ నీరంతా పెద్ద చెరువులోకి చేరడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. రోడ్డుపై ఏర్పడిన గుంతను పరిశీలించిన వారిలో ఆర్ అండ్ బీ ఈఈ రవీందర్‌కుమార్, డీఈ అజయ్‌కుమార్, ఇరిగేషన్ ఈఈ రేణుకాదేవి, డీఈ పరమేశ్వర్, ఏఈ ప్రియాంక, వర్క్‌ఇన్‌స్పెక్టర్ నర్సింహ, మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్, మాజీ సర్పంచ్ పురాణం వీరభద్రస్వామి తదితరులు ఉన్నారు.

తెలంగాణ తల్లి ఫ్లై ఓవర్.. బోర్డు ఏర్పాటు

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవలే జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో తెలుగుతల్లి ఫ్లై ఓవర్ పేరును తెలంగాణతల్లిగా మారుస్తూ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఫ్లై ఓవర్‌కు కొత్త బోర్డును అధికారులు ఏర్పాటు చేశారు. ఫ్లై ఓవర్‌కు తెలంగాణ తల్లి అనే పేరుతోపాటు ఎటువైపు ఏముందో తెలిసేలా సూచిక గుర్తులూ వేశారు. ఈ ఫ్లై ఓవర్ పనులు టీడీపీ హయాంలో ప్రారంభం కాగా, ఫ్లై ఓవర్‌ను పూర్తి చేసేందుకు చాలా జాప్యం జరిగింది. ఫ్లై ఓవర్‌ను ఎక్కడ ముగించాలో అర్థం కాక జాప్యం జరిగినట్లు సమాచారం. అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నిర్మాణం పూర్తిచేసి.. అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కోనేరు రంగారావు దీన్ని ప్రారంభించారు. 2005 జనవరి 22వ తేదీన ప్రారంభోత్సవం జరిగినట్లు అధికారులు తెలిపారు. అప్పట్లో దీనికైన వ్యయం రూ. 22.97 కోట్లు.

అంతర్రాష్ట్ర మద్యం పట్టివేత



సీజ్ చేసిన మద్యాన్ని చూపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

పహాడీషరీఫ్: ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి తీసుకొస్తున్న మద్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన ప్రకారం.. రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జీవన్ కిరణ్ ఆధ్వర్యంలో పహాడీషరీఫ్‌లో దాడులు నిర్వహించి 41 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గోవా, హరియాణ, ఢిల్లీ ప్రాంతాల నుంచి మద్యం బాటిళ్లను దిగుమతి చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బాటిళ్లను సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. శంషాబాద్ ఏరియాలో ఎస్టీఎఫ్ బీ అండ్ డీ టీమ్‌లు నిర్వహించిన దాడుల్లో 45 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్టీఎఫ్‌సీ టీమ్ సీఐ బిక్షారెడ్డి, డీ టీమ్ సిఐ నాగరాజులు చేపట్టిన ఈ వాహనాల తనిఖీలలో రెండు చోట్ల పట్టుబడిన మద్యం విలువ రూ.2.5 లక్షలుగా ఉంటుందని అధికారులు వెల్లడించారు.

స్థానిక పోరుకు సిద్ధం కండి

బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మండలంలోని లష్కర్‌గూడ గ్రామంలో మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి మంచిరెడ్డి హాజరై మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ కార్డు గురించి వివరించారు. పార్టీ నాయకులు ఐక్యంగా పనిచేసి, స్థానిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి, జగదీశ్, చక్రవర్తిగౌడ్, వెంకట్‌రెడ్డి, ధనుంజయగౌడ్, కిరణ్‌కుమార్‌గౌడ్, సాయికుమార్‌గౌడ్, గౌరీశంకర్, రాధాకృష్ణ, రంగయ్య, వివిధ గ్రామాల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

పరామర్శ

మండలంలోని ఇనాంగూడలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పిట్టల బాలశివుడు తండ్రి మాజీ ఉప సర్పంచ్ సత్తయ్య ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి బాలశివుడిని మంగళవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గడువుతీరిన కుర్‌కురే తిని బాలుడికి అస్వస్థత


గడువు తీరిన ప్యాకెట్

ధారూరు: గడువుతీరిన కుర్‌కురే తిని ఓ బాలుడు అస్వస్థతకు గురయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ధారూరుకు చెందిన ఇమ్రాన్(11) మంగళవారం మండల కేంద్రంలోని తాండూరు– హైదరాబాద్ ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న ఓ కిరాణ షాప్‌లో కుర్‌కురే ప్యాకెట్ కొనుగోలు చేసి తిన్నాడు. కొద్దిసేపటికే వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. బాలుడు తిన్న ప్యాకెట్‌ను పరిశీలించగా ఆగస్టు 10, 2025 వరకే గడువు తీరిపోయింది. సదరు దుకాణ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బాధిత తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

యాచారం: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని మాల్ గ్రామానికి చెందిన ఇప్ప లక్ష్మణ్(27) మద్యానికి అలవాటు పడ్డాడు. కుటుంబ సభ్యులు నిత్యం మద్యం తాగొద్దని మదలించారు. దీంతో మనస్తాపం చెందిన ఆయన సోమవారం రాత్రి తన ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

హిందువులకు రక్షణగా ఆర్ఎస్ఎస్


శతాబ్ది వేడుకలో సంఘ్ నాయకులు

పహాడీషరీఫ్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాలను మామిడిపల్లి గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. చార్మినార్ బాగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా సహ బౌద్ధిక్ లాలూ యాదవ్ జీ మాట్లాడుతూ.. సంఘ్ కార్యకర్తలు ప్రతి పనిలోనూ దేశ ప్రయోజనలే పరమావధిగా భావిస్తారన్నారు. 1925 సంవత్సరంలో విజయ దశమి రోజున ప్రారంభించిన ఆర్ఎస్ఎస్ హిందువులకు అన్ని రకాలుగా రక్షణగా ఉంటుందన్నారు. హిందూ సమాజాన్ని సంఘటితం చేస్తూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో బస్తీ ప్రముఖ్ నందీశ్వర్, సతీష్‌గౌడ్, విశ్వనాథ్‌గౌడ్, విజయేందర్‌రెడ్డి, రంగనాథ్, పంచముఖి హనుమాన్ వ్యాయామ శాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తొండుపల్లి ఫ్లైఓవర్‌పై రహదారి మూసివేత

శంషాబాద్: తొండుపల్లి ఫ్లైఓవర్‌పై షాద్‌నగర్‌వైపు వెళ్లే వాహనాలను మంగళవారం ప్రత్యామ్నయంగా సర్వీసు రహదారికి మళ్లిస్తున్నారు. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు లోడ్ పరీక్షలు నిర్వహిస్తున్న కారణంగా షాద్‌నగర్‌వైపు వెళ్లే వాహనాలకు ఫ్లైఓవర్ పైకి అనుమతించడం లేదని శంషాబాద్ ట్రాఫిక్ సీఐ ప్రమోద్‌కుమార్ తెలిపారు. బుధవారం కూడా వాహనాలు సర్వీసు రహదారి గుండా వెళ్లాల్సి ఉంటుందన్నారు.

కృష్ణా నదిలో విద్యార్థి గల్లంతు

నాగార్జునసాగర్: స్నేహితులతో కలిసి హైదరాబాద్ నుంచి మంగళవారం నాగార్జునసాగర్ ప్రాజెక్టును చూసేందుకు వచ్చిన ఇంటర్మీడియట్ విద్యార్థి కృష్ణా నదిలో గల్లంతయ్యాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లికి చెందిన హర్షవర్ధన్, జ్ఞానేందర్, సుమన్, మణికంఠరెడ్డి, వెంకటేష్, చాణక్య (16)స్నేహితులు. వీరంతా వేర్వేరు కళాశాలల్లో ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతున్నారు. వీరంతా కలిసి నాగార్జునసాగర్ ప్రాజెక్టును చూడటానికి మంగళవారం రెండు బైక్‌లపై వచ్చారు. అందరూ కలిసి నాగార్జునసాగర్ డ్యాం దిగువన ఫొటోలు తీసుకున్నారు. అనంతరం కొత్త బ్రిడ్జి సమీపంలో చింతలపాలెం వెళ్లే దారి వెంట ఉన్న ఆంజనేయ పుష్కర ఘాట్‌లోకి దిగి స్నానాలు చేస్తుండగా.. చాణక్య నీటి ఉధృతికి కృష్ణా నదిలో కొట్టుకుపోయాడు. అతడి స్నేహితులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా..వారు గజ ఈతగాళ్లతో కృష్ణా నది తీరం వెంట గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం సాయంత్రం వరకు కూడా గల్లంతైన విద్యార్థి ఆచూకీ లభించలేదు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

కుల్కచర్ల: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని కుల్కచర్ల ఎస్ఐ రమేశ్ పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండలం పుట్టపహాడ్ గ్రామంలో సీసీ కెమెరాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతీ గ్రామంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా దుకాణదారులు ఏర్పాటుచేయించుకుంటే నేరాలు అదుపుచేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కవిత, స్థానిక నాయకులు వెంకట్రాములు, రాజశేఖర్, వెంకన్న, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పుట్టపహాడ్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేశ్

ఎన్నికల పోటీకి ఎవరు అర్హులు?

- నామినేషన్ పరిశీలన నాటికి 21 సంవత్సరాలుండాలి
- కందుకూరు ఎంపీడీఓ సరిత



కందుకూరు: స్థానిక సంస్థల(ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచులు, వార్డు సభ్యులు) ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులకు ఎదురయ్యే సందేహాలపై మంగళవారం ఎంపీడీఓ సరిత సమాధానాలతో నివృత్తి చేశారు.

ప్రశ్న: స్థానిక సంస్థల్లో పోటీ చేయడానికి కనీస వయస్సు ఎంత?

జ: నామినేషన్ పరిశీలన తేదీ నాటికి అభ్యర్థి వయస్సు 21 సంవత్సరాలు నిండి ఉండాలి.

ప్రశ్న: సంబంధిత ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల పరిధిలోని ఓటరు జాబితాలో ఓటరుగా నమోదు కాకపోయినా పోటీ చేయవచ్చా?

జ: లేదు. తెలంగాణ పంచాయతీ రాజ్ నియమావళి ప్రకారం సంబంధిత ఓటరు లిస్టులో తప్పనిసరిగా ఓటరుగా నమోదై ఉండాలి.

ప్రశ్న: అభ్యర్థులకు ఇద్దరు పిల్లల నిబంధన తొలగించారా?

జ: పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉంటే అనర్హులే. 1995 మే 31 ముందు ఇద్దరి కంటె ఎక్కువ మంది సంతానం ఉంటే అర్హులు. 1995 జూన్ 1 తర్వాత పుట్టిన వారితో కలిపి ఇద్దరి కంటే ఎక్కువ ఉన్నప్పుడు అనర్హులవుతారు.

ప్రశ్న: ముగ్గురు సంతానం ఉన్నప్పుడు ఒకరిని దత్తత ఇస్తే పోటీ చేయొచ్చా?

జ: ఉమ్మడి రాష్ట్రంలోని హైకోర్టు తీర్పు ప్రకారం దత్తత ఇచ్చిన పిల్లలు స్వంత తల్లిదండ్రులకు చెందిన పిల్లలుగానే పరిగణించబడతారు. ముగ్గురు సంతానం ఉండి ఒకరిని దత్తత ఇచ్చినా వారు పోటీకి అనర్హులే. వారికి ముగ్గురు సంతానం ఉన్నట్లే పరిగణించబడతారు.

ప్రశ్న: ఒక వ్యక్తికి ఇద్దరు భార్యలు ఉండి వారికి ఒక్కొక్కరికి ఇద్దరు చొప్పున ఉన్నప్పుడు ఏవిధంగా పరిగణిస్తారు?

జ: అప్పుడు భార్యలు పోటీకి అర్హులు అవుతారు, భర్తకు అవకాశం ఉండదు.

ప్రశ్న: పంచాయతీరాజ్ చట్టం ప్రకారం 1995 మే 31 కంటె ముందు ఇద్దరు పిల్లలు ఉండి, పోటీ చేసిన తర్వాత మరొకరు పుడితే ఎలా?

జ: నామినేషన్ల పరిశీలన పూర్తయ్యే సమయానికి అప్పటికే ఇద్దరు పిల్లలు ఉండి, పోటీ చేసే వ్యక్తి భార్యగాని, పోటీ చేసే మహిళనే మళ్లీ గర్భవతిగా ఉన్నా పోటీకి అర్హులే అవుతారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన తర్వాత బిడ్డకు జన్మనిచ్చినా పోటీకి అర్హులే అవుతారు.

ఓఆర్ఆర్ ఎక్కిన ద్విచక్ర వాహనదారుడు

కారు ఢీకొని మృతి

మేడ్చల్ రూరల్: ఔటర్ రింగు రోడ్డుపై ప్రయాణించడానికి ద్విచక్ర వాహనాలకు అనుమతి లేదని తెలిసీ రాంగ్ రూట్లో ఔటర్ ఎక్కి ప్రాణాలు కోల్పోయాడో వ్యక్తి. ఈ సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం గొల్లపల్లికి చెందిన బోయిని కృష్ణ (52) నర్సాపూర్ నుంచి శామీర్‌పేట్ వైపు వస్తూ ఓఆర్ఆర్ ఎగ్జిట్-5 దుండిగల్ వద్ద ద్విచక్ర వాహనంపై టోల్ గేట్ సిబ్బంది వారిస్తున్నా వినిపించుకోకుండా..వారికి చిక్కకుండా వేగంగా ఓఆర్ఆర్ ఎక్కాడు. అతి వేగంగా దుండిగల్ నుంచి శామీర్‌పేట వైపు రాంగ్ రూట్లో ప్రయాణించాడు. మునీరాబాద్ వద్ద ఎగ్జిట్‌కు సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి, విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిటీలో పీపుల్ వెల్ఫేర్ పోలీసింగ్

శాంతిభద్రతలతో పాటు సంక్షేమానికీ ప్రాధాన్యం

- కల్తీల నిరోధానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- మార్కెటింగ్ ఇంటెలిజెన్స్ యూనిట్‌కు రూపం
- సీసీ కెమెరాల ఆడిటింగ్‌తో సమగ్ర నిర్వహణ
- ప్రాధాన్యాలు వెల్లడించిన నగర సీపీ వీసీ సజ్జనర్

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు కమిషనరేట్‌లో పీపుల్ వెల్ఫేర్ పోలీసింగ్ ఆవిష్కృతం కానుందని కొత్త కొత్వాల్ విశ్వనాథ్ చెన్నప్ప సజ్జనర్ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నిరోధంతో పాటు ప్రజా సంక్షేమానికీ పెద్దపీట వేస్తూ విధానాలు రూపొందిచనున్నామని ఆయన పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (టీజీఐసీసీసీ) మంగళవారం నగర పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రస్తుత విధానాలే కొనసాగింపు..

గడచిన కొన్నేళ్లుగా నగర పోలీసింగ్‌లో అనేక సంస్కరణలు వచ్చాయి. అమలులో ఉన్న విధానాలు కొనసాగిస్తూనే అవసరమైన స్థాయిలో కొత్తవి అందుబాటులోకి తీసుకువస్తాం. ప్రజా సంక్షేమ పోలీసింగ్‌లో భాగంగా నగర ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడతాం. ఆహార కల్తీని నిరోధించడానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తాం. ఏయే సరుకులు ఎలా కల్తీ అవుతున్నాయో గుర్తించడానికి మార్కెటింగ్ ఇంటెలిజెన్స్ యూనిట్‌కు రూపమిస్తాం. ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతాం. ఈ కేసుల్లో నిందితులతో డేటా బ్యాంక్ ఏర్పాటు చేసి ఇతర విభాగాలతో సమన్వయంతో పని చేస్తాం.

సైబర్ నేరాలపై పోరు..

ఎప్పటికప్పుడు పంథా మారుస్తూ నానాటికీ రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లకు చెక్ చెప్పడానికి ప్రత్యేక ప్రాధాన్యమిస్తాం. ఇటీవల కాలంలో వృద్ధులే ఎక్కువగా టార్గెట్‌గా మారుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లోని వృద్ధులపై దృష్టి పెట్టాలి. పోలీసు విభాగానికి దూరంగా ఉన్నా బెట్టింగ్ యాప్స్‌పై ఇప్పటికే 'హ్యాష్‌ట్యాగ్ సే నో టు బెట్టింగ్ యాప్స్' పేరుతో ఉద్యమం చేశా. ఫలితంగానే వాటిని నిషేధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మల్టీ లెవల్ మార్కెటింగ్స్, రియల్ ఎస్టేట్ మోసాలు, భూ కబ్జాలపై కఠిన వైఖరి ఉంటుంది. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ నేరాలకు పాల్పడే వారు తమ ఇంట్లో ఉన్న తల్లి, సోదరి, భార్యల్ని గుర్తు చేసుకుని, మహిళల్ని గౌరవించాలి.

ప్రతి ఒక్కరి 'ఫ్యామిలీ టైమ్' పెంచుతాం...

నగరంలో నానాటికీ వాహనాల సంఖ్య పెరిగిపోతోంది. ట్రాఫిక్ సమస్యలతో వాహనచోదకులు ఎక్కువ సమయం రోడ్లపై ఉండాల్సి వస్తోంది. ఈ ప్రభావంతో వారు కాలుష్యం బారినపడి ఆరోగ్యం పాడు చేసుకుంటున్నారు. కుటుంబాలతో వారు గడిపే సమయం కూడా తగ్గిపోతోంది. రహదారులపై వాహనాల సరాసరి వేగం పెంచడంతో పాటు కాలుష్యం తగ్గించి, నగర వాసులు తమ కుటుంబాలతో గడపడానికి ఎక్కువ సమయం మిగిలేలా చేస్తాం. డ్రంక్ డ్రైవింగ్ అనేది రోడ్ టెర్రరిజం. డ్రంక్ డ్రైవర్లు సూసైడ్ బాంబర్లు. వీరి వల్ల ఎన్ని ప్రాణాలైనా పోవచ్చు. కుటుంబాలు వీధినపడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలోనే మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు ఉంటాయి. పోలీసింగ్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డ్రోన్లు వినియోగిస్తాం.

పెద్దల్ని వదిలేస్తే సీనియర్ సిటిజన్స్ యాక్ట్..

ఇటీవల కాలంలో అనేక మంది వృద్ధులైన తమ కుటుంబీకుల్ని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లతో పాటు బహిరంగ ప్రదేశాల్లో వదిలేసి వెళ్లిపోతున్నారు. ఇప్పటికే ఇలాంటి వారిపై రెస్క్యూ కార్యక్రమాలు నడుస్తున్నాయి. ఇకపై ఈ పని ఎవరైనా చేస్తే సీనియర్ సిటిజన్స్ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటాం. నగరంలోని ప్రతి భవనంపైనా ఓ సీసీ కెమెరా ఉండాలి. ప్రస్తుతం ఉన్న వాటిని ఆడిటింగ్ చేయడం ద్వారా అన్నీ పని చేసేలా చర్యలు తీసుకుంటాం. అహర్నిశలు కష్టపడే పోలీసు సిబ్బంది సంక్షేమానికీ పెద్దపీట వేస్తాం. ఉత్తమ పనితీరును కనబరిచిన ఉన్నతాధికారి నుంచి హోంగార్డు వరకు అందరికీ రివార్డులు అందిస్తాం. దీనికోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తాం. నేరగాళ్లకు జ్యూరిస్‌డిక్షన్ ఉండదు. ఈ నేపథ్యంలోనూ మూడు కమిషనరేట్‌లు సమన్వయంతో పని చేయనున్నాయి. సోషల్‌మీడియాను దుర్వినియోగం చేసే వారిపై చర్యలు తప్పవు.

మీ పిల్లలపై ఓ కన్నేసి ఉంచండి..

మైనర్లు చేసే నేరాలు పెరిగిపోతున్నాయి. వాళ్లు ఆ పని చేసే వరకు తల్లిదండ్రులకూ వారి ప్రవర్తన తెలియట్లేదు. స్మార్ట్‌ఫోన్ యుగంలో ప్రతి ఒక్కరూ వారి బిడ్డల కార్యకలాపాలు, ఆన్‌లైన్ స్నేహాలు, క్రయవిక్రయాలపై కన్నేసి ఉంచాలి. టీజీఐసీసీసీలోని కమిషనరేట్, బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్, పాతబస్తీలోని కొత్వాల్ హౌస్‌ల నుంచి పని చేస్తా. ఎప్పుడు ఎక్కడ ఉంటాననే ప్రణాళికను త్వరలోనే విడుదల చేస్తా. ప్రతి పౌరుడు ఓ పోలీసు లాంటి వాడే. తమ చుట్టూ ఉన్న అసాంఘికశక్తులు, కార్యకలాపాలపై కన్నేసి ఉంచి పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలి. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా, సహాయం కావాలన్నా అన్ని స్థాయిల్లోని అధికారులం నిర్విరామంగా అందుబాటులో ఉంటాం. హైదరాబాద్ యాంటీ నార్కోటిక్స్ వింగ్‌కు (హెచ్-న్యూ) సిబ్బంది, వనరులు కేటాయించి దాన్ని బలోపేతం చేస్తాం.


బాధ్యతల స్వీకరణ అనంతరం కుటుంబ సభ్యులతో సజ్జనర్



అక్కడ 17,631

ఇక్కడ 4,855

అత్యధిక సైబర్ నేరాల కేసులు బెంగళూరులోనే

- ఆ తర్వాత స్థానంలో నిలిచిన హైదరాబాద్
- 2023 గణాంకాలను వెల్లడించిన ఎన్సీఆర్బీ
- ఆధారాలు లేక మూతపడుతున్నవే అధికం





ఇతర నగరాల్లో ..

ఏడాది	2020	2021	2022	2023
బెంగళూరు	8,892	6,423	9,940	17,631
ముంబై	2,433	2,883	4,724	4,131
లక్నో	1,465	1,067	1,134	1,453
ఢిల్లీ	166	345	685	407
కోల్‌కతా	172	220	75	21

నగరంలో సైబర్ నేరాలు ఇలా..

ఏడాది	నేరాలు
2020	2,553
2021	3,303
2022	4,436
2023	4,855

సాక్షి, సిటీబ్యూరో

నగరంలో సైబర్ నేరాలు నానాటికీ పెరుగుతున్నాయా..? ఈ-కేటుగాళ్లకు హైదరాబాద్ సాఫ్ట్ టార్గెట్‌గా మారుతోందా..? ఔననే అంటున్నాయి నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) వర్గాలు. 2023కు సంబంధించిన డేటాను ఎన్సీఆర్బీ మంగళవారం విడుదల చేసింది. దీని ప్రకారం సైబర్ నేరాల నమోదులో హైదరాబాద్ నగరం దేశంలోనే రెండో స్థానంలో ఉంది. ఇక్కడ 2023లో 4,855 కేసులు నమోదయ్యాయి. 17,631 కేసులతో మొదటి స్థానంలో బెంగళూరు ఉండగా.. 4,131 కేసులతో ముంబై మూడో స్థానంలో ఉంది. 2022లో మూడో స్థానంలో ఉన్న హైదరాబాద్ ఏడాదిలోనే రెండో స్థానానికి వెళ్లింది.

బ్యాంకింగ్ ఫ్రాడ్స్ కేసులే అత్యధికం..

హైదరాబాద్‌లో నమోదవుతున్న సైబర్ నేరాల్లో ఆన్‌లైన్ బ్యాంకింగ్ సంబంధిత మోసాల కేసులే ఎక్కువగా నమోదవుతున్నాయి. 2,858 సంఖ్యతో మొత్తం కేసుల్లో 58.86 శాతం ఇవే ఉన్నట్లు ఎన్సీఆర్బీ స్పష్టం చేస్తోంది. బ్యాంకు అధికారుల పేర్లతో ఫోన్లు చేసే సైబర్ నేరగాళ్లు వినియోగదారులను నిండా ముంచుతున్నారు. బ్యాంకు ఖాతాల వివరాలు అప్‌డేట్ చేయాలని, నో యువర్ కస్టమర్ (కేవైసీ) తప్పనిసరి అంటూ నమ్మిస్తున్నారు. ఈ పేర్లతో వినియోగదారుల నుంచి బ్యాంకు ఖాతాతో పాటు వ్యక్తిగత వివరాలు, వన్ టైమ్ పాస్‌వర్డ్స్ (ఓటీపీ) సంగ్రహిస్తున్నారు. వీటిని వినియోగించి ఎదుటి వారి ఖాతాలను గుల్ల చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. ఏటీఎం కార్డులు, కేంద్రాలు కేంద్రంగా జరిగే సైబర్ నేరాల సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. 2023లో నగర వ్యాప్తంగా ఈ తరహా కేసులు 211 నమోదయ్యాయి.

'క్లూ' దొరకని కేసులే అధికం..

ఈ సైబర్ నేరాల్లో బాధితులు మోసపోవడం ఎంత తేలికో.. కేసు కొలిక్కి రావడం, నగదు రికవరీ అంత కష్టం. అత్యధిక కేసుల్లో దర్యాప్తు ముందుకు వెళ్లడానికి కనీసం ఒక్క ఆధారం కూడా దొరకదు. ఈ సైబర్ నేరగాళ్లు నేరాలు చేసే సమయంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటారు. సిమ్‌కార్డులు, బ్యాంకు ఖాతాలు తమ పేర్లు, వివరాలతో లేకుండా నేరం చేస్తారు. వీళ్లు వినియోగించే ఇంటర్నెట్ ప్రొటోకాల్ (ఐపీ) అడ్రస్ కూడా దర్యాప్తు సంస్థలకు తెలియకుండా ఉండేందుకు ప్రాక్సీ సర్వర్లు వినియోగిస్తారు. కొందరు పాత్రధారుల, దళారులు మినహా సూత్రధారులు అంతా విదేశాల్లోనే తిష్ట వేస్తుంటారు. అక్కడి వివరాలు సేకరించడానికి ఇక్కడి పోలీసులకు ఏమాత్రం అవకాశం ఉండదు. ఈ కారణంగానే అత్యధిక కేసుల్లో ఆధారాలు సేకరించడం పోలీసులకు సాధ్యం కావట్లేదు. దీంతో బాధితుడు మోసపోవడం, నష్టపోవడం నిజమైనప్పటికీ అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. 2023లో నగరంలో నమోదైన 4,855 కేసుల్లో 2733 (56.29 శాతం) ఆధారాలు లేకపోవడంతో క్లోజ్ అయ్యాయి.

ప్రతి ఫిర్యాదునూ నమోదు చేస్తున్నాం

భవిష్యత్తులో సైబర్ నేరాలు, ఉగ్రవాదమే పెను సవాల్‌గా మారే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలోనే ఇక్కడ ప్రతి ఫిర్యాదును కేసుగా నమోదు చేస్తున్నాం. ఆర్థిక సంబంధిత నేరాల్లో రూ.లక్ష కంటే ఎక్కువ మొత్తంతో ముడిపడిన కేసులను సైబర్ క్రైమ్ ఠాణాలో, మిగిలిన వాటిని స్థానిక పోలీసుస్టేషన్లలో రిజిస్టర్ చేసి దర్యాప్తు చేయిస్తున్నాం. కొన్ని సున్నితమైన కేసుల్లో ఒకప్పుడు బాధితులు.. ప్రధానంగా మహిళలు బయటకు వచ్చి ఫిర్యాదు చేసేవాళ్లు కాదు. ఇటీవల కాలంలో అవగాహన పెరిగిన కారణంగా ఈ పరిస్థితి లేదు. దీంతో ప్రతి ఏడాది నగరంలో సైబర్ క్రైమ్ కేసులు పెరుగుతున్నాయి. వీటిని నిరోధించడానికి అనేక చర్యలు తీసుకుంటున్నాం. పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ కాలేజీలు, స్కూళ్ల వరకు వెళ్తున్నాం.

– నగర పోలీసు అధికారి